ప్రజాశక్తి
గురువారం 11 ఏప్రిల్ 2024 8 పేజీలు


గుంటూరు


పల్నాడు

ఆలోచించి ఓటేయండి

చంద్రబాబును నమ్మొద్దు.. మోసం చేస్తారు.. - పిడుగురాళ్ల 'మేమంతా సిద్ధం' సభలో సిఎం జగన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి/ పిడుగురాళ్ల

టిడిపి అధినేత చంద్రబాబును నమ్మొద్దని, 2014లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన ఎన్‌డిఎ కూటమి మరోసారి ప్రజలను మోసం చేసేందుకు వస్తోందని వైసిపి అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పల్నాడు జిల్లాలో బుధవారం ఆయన బస్సు యాత్ర నిర్వహించారు. శావల్యాపురం మండలం గంటావారిపాలెం నుంచి పుట్టవారిపాలెం, సంతమా గులూరు క్రాస్, రొంపిచర్ల క్రాస్, విప్పర్ల, నకరికల్లు మీదుగా దేవరంపాడు క్రాస్ వద్దకు చేరుకుని భోజన విరామం కోసం ఆగారు. అనంతరం కొండమోడు, పిడుగురాళ్ల బైపాస్ మీదుగా సాయంత్రం 5.30 గంటలకు అయ్యప్పనగర్ బైపాస్ సభ ప్రాంగణానికి చేరుకుని బహిరంగ సభలో పాల్గొన్నారు. సభానంతరం కొండమోడు జంక్షన్, అనుపాలెం, రాజుపాలెం, రెడ్డిగూడెం మీదుగా ధూళి పాళ్ల వద్ద బుధవారం రాత్రి 8 గంటలకు రాత్రి బస శిబిరానికి జగన్ చేరుకున్నారు. దారి పొడవునా వైసిపి శ్రేణులు భారీగా హాజరయ్యారు.

పిడుగురాళ్ల సభలో జగన్ మాట్లాడుతూ 14 ఏళ్లు సిఎంగా చేసిన చంద్రబాబు పేదలకు ఉపయోగపడే ఒక్క పథకాన్నీ సమర్థవంతంగా అమలు చేయలేదన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన 58 నెలల్లో రాష్ట్రంలో ఎన్ని విప్లవాత్మకమైన మార్పులు తెచ్చామని, దీన్ని ఆలోచించి ప్రజలు ఓట్లేయాలని కోరారు. కూటమి, ఎల్లో మీడియాతో కలిసి ఓ గాడిదను తెచ్చి అది గుర్రం..గుర్రం అని ఊదరకొడుతున్నారన్నారు. జాబ్ రావాలంటే బాబు రావాలని ప్రచారం చేస్తున్న వారు 2014 నుండి 2019 వరకు అధికారంలో ఉన్న చంద్రబాబు ఎన్ని ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలన్నారు. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు కేవలం 36 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని, 2019లోకి అధికారంలోకి వచ్చిన తాము సచివాలయ వ్యవస్థ ద్వారా 1.35 లక్షల ఉద్యోగాలిచ్చామని చెప్పారు. వైద్యారోగ్య శాఖలో 58 నెలల్లో 58 వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. ఐదేళ్లలో 2.30 లక్షల ఉద్యోగాలకు నిరుద్యోగులను ఎంపిక చేశామన్నారు. లంచాలు లేకుండా, వివక్ష లేకుండా పాలన అందించామని, 130 సార్లు బటన్ నొక్కి రూ. 2.71 లక్షల కోట్లు ప్రజలకు అందించామని అన్నారు. వాలంటీర్ల వ్యవస్థను తప్పుపట్టిన చంద్రబాబు ▶ 2లో





సభకు హాజరైన జనం.. 2014 టిడిపి ఎన్నికల మేనిఫెస్టోను చూపుతూ మాట్లాడుతున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్

12న ఇండియా వేదిక బహిరంగ సభ

ప్రజాశక్తి-గుంటూరు

'ఇండియా' వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఈనెల 12న గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి, గుంటూరు పార్లమెంట్ స్థానం నుండి ఇండియా వేదిక అభ్యర్థిగా పోటీ చేస్తున్న జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బహిరంగ సభలో సిపిఐ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రఘువీరారెడ్డి పాల్గొంటారని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేసే నాయకులు కావాలో, ఎన్నికల్లో డబ్బులు పంచి ప్రజలకు వంచనకు గురిచేసే పెత్తందారులు కావాలో ప్రజలు నిర్ణయించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తాము ఎప్పుడూ ప్రజల పక్షమే ఉంటామన్నారు. సమావేశంలో నాయకులు గని, ఎం.హనుమంతరావు, పి.సత్యనారాయణ, పి.శివాజీ పాల్గొన్నారు.

రూ.77,500 నగదు సీజ్

ప్రజాశక్తి-గుంటూరు : జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనకు సంబంధించి గుంటూరు జిల్లాలో నిర్వహించిన తనిఖీల్లో తాడికొండ నియోజకవర్గ పరిధిలో రూ.77,500 నగదును సీజ్ చేశారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకూ జరిగిన తనిఖీలో మొత్తం రూ.2 కోట్ల 6 లక్షల 19 వేల 180 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేశారు.

'మేమంతా సిద్ధం'కు బస్సులు.. కూలీల పాట్లు..

6 లో


పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ పి.రాజశేఖర్ తదితరులు

సమానత్వంతోనే జాతి నిర్మాణం

సామాజిక న్యాయంతోనే ఇది సాధ్యం

పూలే జయంతి సభలో వక్తలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి ఉత్సవాలను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయలోని మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పూలే విగ్రహానికి వీసీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్, ఇతర అతిథులు పూలమాలలేసి నివాళు లర్పించారు. అనంతరం 'పూలే ఫిలాసఫీ, ఆలోచన విధానం' అంశంపై జరిగిన సభకు జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎం.త్రిమూర్తిరావు అధ్యక్షత వహించారు. వీసీ మాట్లాడుతూ దేశంలో మనుషుల మధ్య సమానత్వం కోసం పోరాడిన గొప్ప మహనీయుడు మహాత్మ పూలే అన్నారు. ▶ 2లో



రైతు కష్టానికి నాటిక పట్టం

- **ముగిసిన సంయుక్త జాతీయ స్థాయి నాటకోత్సవాలు**
- **నాలుగు రోజులపాటు 12 నాటికల ప్రదర్శన**

ప్రజాశక్తి - యడ్లపాడు

కొండవీటి కళాపరిషత్, పుచ్చలపల్లి సుందరయ్య నాటకోత్సవ కమిటీ ఆధ్వర్యంలో సంయుక్త జాతీయ స్థాయి నాటకోత్సవాలు ప్రేక్షకుల కరతాళ ధ్వనుల మధ్య బుధవారం రాత్రి ముగిశాయి. మండల కేంద్రమైన యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళా ప్రాంగణంలో చివరి రోజు మూడు నాటికలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాపరిషత్ అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు మాట్లాడుతూ సమాజంలో ఉత్పన్నమయ్యే ప్రతి సమస్యనూ ముందే కళల ద్వారా చూపించి వాటికి పరిష్కారం చెప్పే దివిటీలు నాటికలని అన్నారు. తొలుత పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి రైతు, కౌలు రైతు సంఘాల రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, వై.రాధాకృష్ణ, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్, మండల కన్వీనర్ టి.కోటేశ్వరరావు, న్యాయవాది వైవీ రమేష్‌బాబు, డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు, ఎం.పద్మారావు, జె.శంకరరావు, ఎన్.కాళిదాసు, ఎం.రామారావు, ప్రముఖ రచయిత, ▶ 2లో



12, 13 తేదీల్లో ఈవీఎంల కేటాయింపు

ప్రజాశక్తి-గుంటూరు

ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు పాటిస్తూ పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియపై అసెంబ్లీ నియోజకవర్గాల ఏఆర్వోల బృందాలకు కలెక్టరేట్‌లో బుధవారం అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు జిల్లాలోని నియోజకవర్గాలకు ఈవీఎం యూనిట్లు బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్లను మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయిస్తారని చెప్పారు. ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ ఏప్రిల్ 12, 13 తేదీల్లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కట్టుదిట్టమైన భద్రతతో రెవెన్యూ కళ్యాణ మండపంలో నిర్వహిస్తామన్నారు. జిల్లాకు కేటాయించిన ఈవీఎం యూనిట్లను గతంలోనే బెల్ ఇంజనీర్లు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఫస్ట్ లెవల్ చెకింగ్ చేశారని తెలిపారు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ద్వారా ర్యాండమైజేషన్ ద్వారా నియోజకవర్గాలకు కేటాయించిన బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్లను జాగ్రత్తగా సరిచూసుకొని ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పూర్తి భద్రత మధ్య డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలోని స్ట్రాంగ్ రూంలకు ▶ 2లో

చికెన్ వ్యర్థాల పట్టివేత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : పౌల్ట్రీ వ్యర్థాలు అక్రమంగా తరలిస్తుండగా విజిలెన్సు అధికారులు దాడి చేసి స్వాధీనం చేసుకున్న ఘటన స్థానిక అమరావతి రోడ్డులోని లాడ్జిసెంటర్‌లో బుధవారం జరిగింది. ఫిషరీస్ డెవలప్ మెంట్ అధికారి తో కలసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా అశోక్ లేలాండ్ ట్రక్ ద్వారా సత్తెనపల్లి మం డలం భృగుబండలోని చెరువులలో చేపలకు విని యోగిం చేందుకు తీసుకువెళ్తున్నట్టు అధికారులు కనుగొన్నారు. దీని వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు ప్రజారోగ్యానికి నష్టం వాటిల్లడంతో పాటు రోగాలు వ్యాపిస్తున్నాయి. అధికారులు డ్రైవర్ వాంగ్మూలాన్ని నమోదు చేశారు. క్రిమినల్ కేసు నమో దు చేసేందుకు అరండేల్‌పేట ఎస్‌హెచ్‌ఓకు అప్ప గించారు. తనిఖీలలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీని వాసులురెడ్డి, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వీణ తదితరులు పాల్గొన్నారు.



రైతు కష్టానికి నాటిక పట్టం

(మొదటి పేజీ తరువాయి)

దర్శకులు కందిమళ్ల సాంబశివరావు, సినీ, నాటక నటులు వైఎస్.కృష్ణేశ్వరరావు, జె.రామారావు, కె.శ్రీహరిరావు, టి.సాంభవివరావు, సిహెచ్.సృజన, ఎ.పెద్దబ్బయ్య, ఎన్.విజయలక్ష్మి పూలమాలలేసి నివాళులర్పించారు.


అనంతరం నిర్వహించిన నాటిక ప్రదర్శనల్లో భాగంగా తొలిగా శిల్ప ఆకురాతి రచించిన 'క్షేత్రం' నాటికను జివి మనోహర్ దర్శకత్వంలో ఆరాధన అకాడమి గుంటూరు కళాకారులు ప్రదర్శించారు. రైతులు తమ క్షేత్రాల్లో పంటలు పండించకుంటే మానవ జాతికి తిండి ఉండదు. స్త్రీలు కడుపు పంట పండించకపోతే మానవులే ఉండరు.. మేధావులు, మహానుభావులు పట్టింది ఆ క్షేత్రం నుండే. అటువంటి క్షేత్రాలను కాపాడుకుందాం.. ఆడపిల్లలను బతకనిద్దాం.. బతికించుకుందాం.. అనే సందేశంతో సాగిన నాటిక పలు సందర్భాల్లో ప్రేక్షకులను కంటతడి పెట్టించింది.

రెండో ప్రదర్శనగా చెరుకూరి సాంబశివరావు రచించి దర్శకత్వం వహించిన 'విముక్తి' నాటికను ఉషోదయ కళానికేతన్ కట్రపాడు కళాకారులు ప్రదర్శించారు. సమాజాన్ని ముందుండి నడిపించాల్సిన యువత గంజాయి, హెరాయిన్ తదితర మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. దేశ భవిష్యత్‌కు ప్రశ్నార్థకంగా మారుతున్నారు. మాదకద్రవ్యాల నుండి యువతకు విముక్తి కలిగిద్దాం.. దేశాన్ని రక్షించుకుందాం.. అనే సందేశంతో ముగి సిన నాటిక ప్రేక్షకుల్లో ఆలోచనలు రేకెత్తించింది.చివరి ప్రద ర్శనగా కంచర్ల సూర్యప్రకాశరావు రచించిన 'రైతేరాజు' నాటి కను కొల్లా రాధాకృష్ణ దర్శకత్వంలో కళాంజలి హైదరాబాద్ కళాకారులు ప్రదర్శించారు. దేశం వెలుపల జావాను, దేశం లోపల కిసాను లేకపోతే జనం సుఖంగా బతకటం కష్టం.. సాంకేతిక పరిజ్ఞానం పెరిగి పిడికెడంత సెల్‌ఫోన్‌తో ప్రపంచాన్నే శాసిస్తున్నారు. సెల్‌ఫోన్ లేకపోయినా బతకొచ్చు కానీ రైతు పండించే పిడికెడంత అన్నం తినకుండా ఎవరూ బతకలేరు. జనానికి అన్నం పెట్టే, దేశానికి వెన్నెముకైన రైతులు ఈ రోజు దేశమంతటా రోడ్డునపడ్డారు. వారి కష్టాలు ఎవరికీ కనిపించడం లేదు. వాళ్ల ఘోష ఎవరికీ వినిపించడం లేదు. గుండు సూది నుండి విమానం వరకు తయారు ప్రతి వస్తువునూ తయారు చేసేవాడు ఆ వస్తువులకు రేటు నిర్ణయించుకుంటాడు. కానీ ఆరుగాలం ఎండనకా, వాననకా మట్టిలో శ్రమించి పంట పండించే రైతు తన పంటకు తనే ధర నిర్ణయించుకునే హక్కు లేదు. రైతుకు కల్తీ విత్తనాలు ఇచ్చేవాడు శత్రువు, కల్తీ మందులు అమ్మేవాడు శత్రువు, మధ్య దళారులు శత్రువు. అసలు ప్రకృతే రైతుకు పెద్ద శత్రువు. ఇంత మంది శత్రువుల మధ్య బతకలేక రైతులు ఆత్మహత్యలు చేసు కుంటున్నారు. ప్రజలకు తిండి పెట్టాలని శ్రమిస్తున్న రైతుల్ని పట్టించుకోపోతే రైతులు మరోకోణంలో ఆలోచించి తమకు సరిపడా పంటను పండించుకుని పంటలు పండిం చడం ఆపేస్తే మిగతా జనం ఏం తిని బతుకుతారు.. అని ప్రశ్నిస్తూ, పాలకుల బాధ్యతలను గుర్తు చేస్తూ సాగిన నాటిక రైతుల కష్టా లను కళ్లకు కట్టింది. ప్రదర్శనల అనంతరం వివిధ విభాగాల్లో విజేతలకు, కళాకారులకు బహుమతులు ప్రదానం చేశారు.

మద్యంతో పట్టుబడిన వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-తెనాలి

ఎస్ఈబి అధికారుల తనిఖీల్లో మద్యంతో పట్టుబడిన వ్యక్తులలో ఒకరు ఆత్మహత్యాయత్నం చేశారు. సేకరించిన వివరాల ప్రకారం రూరల్ గ్రామం గుడి వాడకు చెందిన ఏసోబు, చలపతి మద్యం కలిగి ఉండటాన్ని గుర్తించి ఎస్ఈబి అధి కారులు మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. వారిని స్టేషన్‌కు తర లించారు. ఏసోబుకు సంబంధించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని తిరిగి బుధవారం స్టేషన్‌కు రావాల్సిందిగా చెప్పారు. రాత్రికి ఇంటికి వెళ్లిన ఏసోబు, తిరిగి బుధవారం ఉదయం ఎస్ఈబి స్టేషన్‌కు వస్తూ ఆ సమీపంలో పురుగు మందు సేవించాడు. ఇది గమనించిన ఎస్ఈబి సిబ్బంది అతనిని ఆసుపత్రికి తరలించారు. అయితే, ఈ ఘటనపై భిన్న కథనాలు వినబడుతున్నాయి. ఎస్ఈబి అధికారులు ఏసోబు, చలపతి ఇరువురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించిన తర్వాత చలపతిని వదిలేశారని, ఇరువురి వద్ద ఉన్న ఆరు మద్యం సీసాలు తన వద్ద ఉన్నట్లు సేట్‌మెంట్ నమోదు చేసి, వేలి ముద్రలు తీసుకున్నారని ఏసోబు ఆరో పిస్తున్నాడు. దీనికి భయపడి తాను పురుగుమందు తాగినట్లు చెబుతున్నాడు. అయితే, దీనిపై ఎస్ఈబి సిఐను వివరణ కోరగా వాస్తవానికి ఇరువురి వద్ద చెరో మూడు బాటిల్స్ మాత్రమే ఉన్నాయని, వీరిలో ఏసోబు మద్యం కేసులో పాత నిందితుడని చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో అతన్ని బైండోవర్ చేసేందుకే బుధవారం స్టేషన్‌కు పిలిపించినట్లు చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న పట్టణ వన్ టౌన్ పోలీసులు జిజిహెచ్‌లో చికిత్స పొందు తున్న బాధితుని వద్ద స్టేట్‌మెంట్ రికార్డు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఎస్ఈబి అధికారులు సీజ్ చేసిన ఏసోబు వాహనాన్ని కూడా పంపించేసినట్లు సమాచారం.



బాధితుని వద్ద స్టేట్‌మెంట్ రికార్డు చేస్తున్న పోలీసులు



రొంపిచర్ల మండలంలో ఘనస్వాగతం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సిఎం బస్సు యాత్ర రొంపిచర్ల మండలం మీదుగా సాగింది. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం అడ్డరోడ్డు నుండి రొంపిచర్ల మండలంలో అన్నవరప్పాడు, వీరవట్నం ఓవర్ బ్రిడ్జి, సుబ్బయ్య పాలెం అడ్డరోడ్డు, రొంపిచర్ల, సంతగుడిపాడు, మర్రిచెట్టుపాలెం, విప్పర్ల గ్రామాల మీదుగా బస్సు యాత్ర కొనసాగింది. ఆయా గ్రామాల్లో బస్సుయాత్రకు ఘన స్వాగతం లభించింది. హైవే మీద వైసిపి నాయకులు, కార్యకర్తలు, జనం సిఎం రాక కోసం బారులు తీరారు. యువకులు బైక్‌లోతో విన్యాసాలు చేశారు. సిఎం రాగానే భారీ క్రేన్ సాయంతో గజమాలను వైసిపి శ్రేణులు జగన్‌కు వేశారు. అయన బస్సుపై నుండి ప్రజలకు అభివాదం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ కె.శ్రీనివాసరెడ్డి, నాయకులు సిహెచ్.గోపాలరెడ్డి, పి.శివారెడ్డి, సిహెచ్.సంజీవరెడ్డి, పి.చక్రారెడ్డి, జి.చినకోటిరెడ్డి, పి.రవీంద్రబాబు పాల్గొన్నారు.



రూ.1964 కోట్లతో గురజాలను అభివృద్ధి : మహేష్‌రెడ్డి

గురజాల నియో జకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 57 గ్రామాలు, మూడు మున్సిపాల్టీల్లో రూ.218 కోట్లతో ప్రతి ఇంటికి పైప్ లైను ఏర్పాటు చేసి ఏడాదిలో ఇంటింటికీ కృష్ణానది నీరు అందిస్తామని చెప్పారు. రూ.500 కోట్లతో పిడుగురాళ్లలో మెడికల్ కళాశాలను నిర్మిస్తున్నామన్నారు. దాచేపల్లి, గురజాలను మున్సిపాల్టీలుగా మార్చామన్నారు. మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కొత్తగా మేనిఫెస్టో రూపొందించి సొంతగా గ్యాస్ సిలిండర్ ఇస్తానని చెబుతున్నారని, రూ.814 గ్యాస్ సిలిండర్‌ను రోజుకి 50 పైసలు ముష్టిలా ప్రజలకు ఇస్తానని చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు.

ఆలోచించి ఓటేయండి


(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు వారికి రూ.10 వేలు జీతం ఇస్తారంటే ఎవరైనా నమ్ముతారా అని ప్రశ్నించారు. నర్సరావుపేట లోక్‌సభ వైసిపి అభ్యర్థిగా అనిల్‌కుమార్ యాదవ్‌ను అసెంబ్లీ అభ్యర్థులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కాసుమహేష్‌రెడ్డి, అంబటి రాంబాబు, కావటి మనోహర్ నాయుడు, బొల్లా బ్రహ్మనాయుడు, నంబూరు శంకరరావు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని గెలిపించాలని ప్రజలకు జగన్ విజ్ఞప్తి చేశారు.

12, 13 తేదీల్లో ఈవీఎంల కేటాయింపు

(మొదటి పేజీ తరువాయి)

తరలించాలని చెప్పారు. ర్యాండమైజేషన్ విధుల్లో అధికారులు, ఉద్యోగులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.రోజ, ఈవీఎంల నోడల్ అధికారులు హౌసింగ్ పీడీ వేణుగోపాల్, ఐటీ నోడల్ అధికారి రఘు, ర్యాండమైజేషన్ విధులు కేటాయించిన ఏఆర్వోలు, ఉద్యోగులు పాల్గొన్నారు.



వైసిపిలో చేరిన కార్యకర్తలతో మంత్రి రజని

టిడిపి, జనసేన కార్యకర్తలు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే వైసిపి మరోసారి అధికారంలోకి రావాలని, టిడిపి గెలిస్తే పేదలకు పథకాలు నిలిపివేస్తారని మంత్రి విడదల రజిని అన్నారు. స్థానిక 25వ వార్డు పరిధిలో 300 మంది టిడిపి, జనసేన కార్యకర్తలు వైసిపిలో చేరారు. గుంటూరులోని చుట్టుగుంట సెంటర్‌లో బుధవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో వీరికి పార్టీ కండువాలు వేసిన మంత్రి, సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో 25వ డివిజన్ టిడిపి కార్యదర్శి శివన్నారాయణతోపాటు టిడిపి, జనసేనల నుంచి కొండలు, శ్రీనివాసరావు, యాకోబు, శ్రీనుబాబు, సీతాలు, సత్య నారాయణ, ఏసుబాబు, సతీష్, మహేష్, రమణకుమార్, మణి, వెంకటరావు తదితరులు వైసిపిలో చేరారు. డిసిసిబి చైర్మన్ ఆర్.సీతారామాంజనేయులు, స్థానిక కార్పొరేటర్ సిహెచ్ కరుణ కుమారి, కార్పొరేటర్ గురవయ్య, క్లస్టర్ కార్యదర్శి డి.బ్రహ్మం పాల్గొన్నారు.

సమానత్వంతోనే జాతి నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

సంస్కర్తల జీవితాలను అధ్యయనం చేస్తే మనోవికాసం కలుగుతుందని చెప్పారు. అధ్యయనంతో సరిపెట్టకుండా వారి ఆలోచన విధానాన్ని అమల్లో పెట్టాలన్నారు. నిజాన్ని అన్వేషించే తత్వాన్ని పూలే తన సత్యశోధక్ సమాజ్ ద్వారా మనకందించారని, మానసిక బానిసత్వాన్ని విడనాడాలని గులాంగిరి పుస్తకం ద్వారా చెప్పారని అన్నారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఇనుకొండ తిరుమాలై, మాట్లాడుతూ మహిళ సమానత్వం గురించి దేశంలో పోరాటాన్ని ప్రారంభించిన మొదటి వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అన్నారు. అట్టడుగున ఉన్నవాళ్ళందరూ ఒక్కటైతే అది దేశం అవుతుందని, సాంస్కృతికంగా ఒక్కటైతే అప్పుడు సమానత్వం వస్తుదని అన్నారు. అప్పుడు మాత్రమే దేశం అనే భావన వస్తుందనే సత్యాన్ని పూలే విశ్వసించారని గుర్తుచేశారు. జాతి నిర్మాణం అనేది కుల, మతాలకు అతీతంగా అందరు సమానం అయినప్పుడు మాత్రమే జరుగుతుందన్నారు. ఇది కేవలం సామజిక న్యాయ అమలు ద్వారానే సాధ్యమని పూలే నమ్మి ఆచరించాడని తెలిపారు.. అణగారిన వర్గాల కోసమే కాకుండా బ్రాహ్మణ స్త్రీలు వారి విద్య, సంక్షేమం గురించి కూడా పోరాడి వారికి సమాన అవకాశాలను కల్పించడానికి పూలే అనేక కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. వితంతు వివాహాన్ని జరిపించిన ఘనుడు పూలే అని కొనియాడారు. ఆయన ఆలోచన విధానాన్ని నేటితరం స్ఫూర్తిగా తీసుకొని మహిళలకు సమస్త రంగాల్లో సమాన అవకాశాలు, హక్కులు కల్పించాన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టర్ ప్రొఫెసర్ వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, పాలక మండలి సభ్యులు డాక్టర్ వి.వెంకటేశ్వర్లు (కన్నా మాస్టారు), సీనియర్ అడ్వకేట్ వైకె, ప్రిన్సిపల్స్ ప్రొఫెసర్ పి.సిద్ధయ్య, ప్రొఫెసర్ స్వరూపరాణి, ప్రొఫెసర్ వై.అశోక్ కుమార్, ఒఎస్‌డి ప్రొఫెసర్ కె.సునీత, సిడిసి డీన్ మధుబాబు, ప్రోగ్రామర్ బి.కోటి యాదవ్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి



ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లిలో అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందాడు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానంద పురం ఎయిమ్స్ రోడ్డులోని ఫారెస్ట్‌లో చెట్టుకు వేలాడుతున్న గుర్తుతెలియని యువకుడి మృత దేహాన్ని వాకర్లు బుధవారం గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు పాల్ప డిన యువకుడు నార్త్ ఇండియాకు చెందిన వ్యక్తిలా ఉన్నాడని, యువకుడిని హత్య చేసి చెట్టుకి ఉరివేసి ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు.

ప్రచార వాహనంపై దాడి ఘటన

ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాశక్తి- రెంటచింతల

మండలంలోని మంచికల్లులో మంగళవారం రాత్రి నరసరావుపేట తెలుగుదేశం పార్టీ ఎంపి అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలుకు చెందిన ఎన్నికల ప్రచార వాహనంపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఎల్‌ఈడి స్క్రీన్‌ని ధ్వంసం చేసి సౌండ్ బాక్స్ పగలగొట్టిన ఘటనలో డికొండ ఆంజనేయులు, అంజిరెడ్డి, దమ్ము అంజిబాబులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ హనుమంతరావు తెలిపారు.

బీసీల పొట్ట కొట్టి.. పెత్తందారులకు పట్టం

సిఎం జగన్‌పై ఎమ్మెల్సి జంగా విమర్శలు

ప్రజాశక్తి - వినుకొండ

రాష్ట్రంలో బీసీల పొట్ట కొట్టి పెత్తందార్లకే పట్టం కట్టిన చరిత్ర హీనుడిగా ముఖ్యమంత్రి జగన్ రెడ్డి, అతడి పార్టీ వైసిపి నిలిచిపోతుందని ఎమ్మెల్సీ జంగా కృష్ణ మూర్తి విమర్శించారు. ఎంతో నమ్మకంతో ఆ పార్టీలో చేరిన తనలాంటి బీసీ నాయకులకు అక్కడ మిగిలింది అవమానాలు, అణచివేతలు, ఛీత్కారాలే అని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి వ్యవస్థాపక సభ్యుల్లో ఒకడిగా ఉన్న తనకే అలా జరిగితే, ఆ పార్టీలో మిగిలిన బీసీ నేతల పరిస్థితేంటో అర్థం చేసుకోవచ్చున్నారు. ఇంత కాలం అవన్నీ పంటిబిగువున భరించినా ఇంకా ఆత్మ గౌరవం చంపుకోలేక, పల్నాడు ప్రాంత అభివృద్ధిని నిర్ల క్ష్యం చేయలేకే తాను వైసిపిని వీడాల్సి వచ్చిందని అన్నారు. తెలుగుదేశం పార్టీలో చేరిన తర్వాత కూటమి తరఫున తొలిసారి విస్తృత ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న జంగా, జగన్ ప్రభుత్వం తీరుపై నిప్పులు చెరి గారు. బుధవారం వినుకొండ నియోజకవర్గం నూజెండ్ల మండలం ఉప్పలపాడు, గురపనాయుడు పాలెం, నూజండ్ల, రవ్వవరం, బుర్రిపాలెం, ముత్తరాశి పాలెం, పమిడిపాడు, కంభంపాడు, తెల్లపాడు, టి. అన్న వరం, ఐనవోలు, చింతలచెరువు, ముత్యంజయ పురం లో ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థిగా విను కొండ నియోజకవర్గ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న జీవీ ఆంజ నేయులు, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలుతో పాటు ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగా మాట్లాడుతూ బీసీలను రాజకీయ నాయత్వానికి దూరం చేయడంతో పాటు విద్య, వ్యాపార రంగాల్లో కూడా దారుణంగా మోసం చేసింది వైసిపి ప్రభుత్వమేనని దుయ్యబట్టారు.





విందులో వడ్డిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

నాల్గో వార్డులో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పట్టణంలోని స్థానిక నాలుగో వార్డు ముల్లవారి వీధిలో వైసిపి ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ నాజర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందును వైసిపి అసెంబ్లీ అభ్యర్థి మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ముస్లింలకు ఆయన వడ్డించారు. ఈ సందర్భంగా ముస్లిము లకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ విందులో వెయ్యి మందికి పైగా పాల్గొన్నారు. పట్టణ, మండల వైసిపి నాయకులు, ముస్లిం మైనార్టీ నేతలు, షేక్ నాజర్, షేక్ జాఫర్,షేక్ ఫజురుల్లా, షేక్ ఖయ్యుం, మహమ్మద్ అమీనుల్ హక్ మొల్ల కరీం, సయ్యద్ గౌస్, ఎన్.అంకినీడు చౌదరి, వి.ప్రసాదరావు, బి.వేణుప్రసాద్, ఎం.అనిల్ కుమారి, ఎ.సాంబశివరావు పాల్గొన్నారు.

యునీకేర్ హోమియోపతి వైద్యశాల ప్రారంభం

ప్రజాశక్తి - నరసరావుపేట

నరసరావుపేటలో పల్నాడు రోడ్డులోని యునికేర్ హోమియోపతి వారి నూతన వైద్యశాలను బుధవారం ప్రారంభించారు. డాక్టర్ అంబడిపూడి కృష్ణ ప్రసాద్, డాక్టర్ ఎం.నేత్ర, డాక్టర్ ఎం హన్వి ప్రశాంతి, డాక్టర్ ఎం.రమేష్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోపికృష్ణ మాట్లాడుతూ డాక్టర్ సామ్యూల్ హనిమాన్ జయంతి సంద ర్భంగా యునీకేర్ వైద్యశాలను ప్రారంభించినట్లు యాజమాన్యం తెలిపారు. పల్నాడు ప్రజలు హోమియోపతి వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరారు. పూర్తి ఆరోగ్య పరి రక్షణకు సంబంధించిన వైద్యులచే వైద్య సేవలు అంది స్తామని అన్నారు. ఈ వైద్యశాలలో విలేకరులకు 50 శాతం రాయితీ ఇస్తున్నామని, మొదటి 500 పేషెంట్లకు ఉచితంగా ఓపి చూడనున్నట్లు చెప్పారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 1,04,430
మిర్చి ఎగుమతి	: 1,09,547
మిర్చి నిల్వ	: 85,482

మిర్చి ధరలు

	రూపాయలలో
334	8,500 - 18,500
నెం.5	9,000 - 13,500
273	9,000 - 12,000
341	8,000 - 16,000
4884	9,500 - 13,000
	నాన్ ఎసి
తేజ	8,000 - 19,500
బడిగి	9,000 -16,000
దేవనూరు డీలక్స్	8,000 -16,500
తాలుకాయలు	5,000 - 11,500

స్పెషల్ డ్రైవ్‌తో మురుగు కాల్వలు శుభ్రం చేయాలి



వార్డు విజిట్ లో భాగంగా నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలో సమస్యల పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సి. రవిచంద్రరెడ్డి

ప్రజాశక్తి - నరసరావుపేట

నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రరెడ్డి మార్నింగ్ విజిట్ లో భాగంగా బుధవారం స్థానిక 15వ వార్డు కొండలరావుపేట, 17వ వార్డు వరవకట్ట పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికులను అడిగి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు డ్రైనేజీ సమస్య ఉందని, మురుగు కాల్వల్లో నీరు పారడం లేదని,మురుగు నీరు వెనక్కి వస్తోందని చెప్పారు. కాల్వలు కూడా పాతవై పాడైపోయాయని, తాగునీటి సరఫరా ఎక్కువ సమయం వచ్చేలా చూడాలని ప్రజలు కోరారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులను ఆదేశిస్తూ కొత్త కాల్వల నిర్మాణానికి కావాల్సిన ప్రణాళికలను రూపొందించాలని, మురుగు నీరు పారడానికి ఏమైనా డ్రైవ్ రైజ్ చేయాల్సి ఉంటే వాటిని చేయాలని ఆదేశించారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా కాల్వలను శుభ్రంగా చేసేలా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ అధికారులకు ఆదేశించారు. ఈ ఏరియాలో ఎక్కువ ఆక్రమణలు చేశారని, ఆక్రమణలు చేసిన ప్రతి ఒక్కరికి నోటీసు ఇచ్చి వారి వస్తువులను వారి ఇంట్లో పెట్టుకోవాలని, లేనిపక్షంలో వారికి ఫైన్ వేయాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలతో ఆయన మాట్లాడుతూ ఆక్రమణల కారణంగా కాల్వలు శుభ్రం చేయడానికి ఆటంకం కలుగుతుందని, ఇళ్ళ ముందు ఆక్రమణలు తొలగించినట్లయితే సులువుగా శుభ్రం చేసు కోవచ్చని, ఈ విషయమై పుర పాలక సంఘానికి సహకరించాలని, వార్డు అభివృద్ధికి తోడ్ప డాలని ప్రజలను కోరారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నర సింహారావు, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ రాజు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రామ కోటయ్య పాల్గొన్నారు.



సత్కారం పొందుతున్న షేక్ రుబీనా

ఈశ్వర్ ఇంజినీరింగ్‌లో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి – నరసరావుపేట

స్థానిక కేసనపల్లిలోని ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ (ఇసిఇ) రెండో సంవత్సరం విద్యార్థులకు పిసిబి డిజైన్ అంశంపై ఏపీ ఎస్ఎస్‌సిడిసి నుంచి షేక్ రుబీనా ఆధ్వర్యంలో వారం రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించామని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. పిసిబి బోర్డు నమూనా ఎలా తయారు చేయాలో విద్యార్థులకు వివరించినట్లు పేర్కొన్నారు. ఇటువంటి వర్క్‌షాప్‌ల ద్వారా విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెరగవుతాయని చెప్పారు. కళాశాల సెక్రటరీ – కరస్పాండెంట్ షేక్ కరీం మొహిద్దిన్, మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ ఇటువంటి వర్క్‌షాపులు వినియోగించుకొని విద్యార్థులు ఉద్యోగ అవకాశాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ షేక్ మస్తాన్ మీరావలి, ఇసిఇ విభాగాధిపతి షేక్ బషీర్, అధ్యాపకులు పాల్గొన్నారు.



జూలకంటి శోభారాణి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి – మాచర్ల : ఎన్‌డిఎ కూటమి నర్సరావుపేట ఎంపి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎంఎల్ఎ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ బ్రహ్మారెడ్డి భార్య శోభారాణి పట్టణంలోని 2, 15 వార్డుల్లో బుధవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ అభ్యర్థులు గెలిస్తే తాగునీటి పరిష్కారం ఆవుతుందన్నారు. పేదల ఆదాయాన్ని రెట్టింపు చేసే బాధ్యత చంద్రబాబుదన్నారు. అనేక సంక్షేమ పథకాలను అందించే సత్తా చంద్రబాబుకు ఉందన్నారు. ప్రచారంలో కూటమి పార్టీల నాయకులు కె.దుర్గారావు, వై.కేశవరెడ్డి, జి.నాసరయ్య, ఒ.క్రాంతి కుమార్, ఎన్.ప్రసాదు, బి.శ్రీనివాసరావు, బి.బ్రహ్మం, ఎన్.గురవారెడ్డి, పి.లక్ష్మారెడ్డి, ఎ.వెంకటేశ్వరరెడ్డి, బాధన్‌బాయ్, జానిబాషా పాల్గొన్నారు.

కొత్తపల్లిలో రుద్రమదేవి ప్రచారం

ప్రజాశక్తి – విజయపురిసౌత్ : అభివృద్ధి కావాలంటే చంద్రబాబును గెలిపించాలని కూటమి తరుపున నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు సొదరి రుద్రమదేవి అన్నారు. మాచర్ల మండలం కొత్తపల్లిలో ఆమె బుధవారం 'బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటి ప్రచారం చేశారు. నిరుద్యోగులుకులకు ఉపాధి అవకాశాలు రావాలంటే చంద్రబాబు సిఎం కావాలన్నారు. కార్యక్రమంలో శ్రీరామ్మూర్తి, జి.విజయ్‌బాబు, వెంకటప్పయ్య పాల్గొన్నారు.



ఏళ్లు గడుస్తున్నా సరిగా అందని నీళ్లు..

- మండే ఎండలకు మాచర్లలో అడుగంటుతున్న బోర్లు
- తాగునీరు ఎద్దడితో అల్లాడుతున్న పట్టణ శివారు ప్రాంతాలు

ప్రజాశక్తి – మాచర్ల

మాచర్ల పట్టణం గత పదేళ్లలో ఎంతో విస్తరించింది. పట్టణంలో అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములు అధికంగా ఉండటంతో చుట్టు ప్రక్కల గ్రామాల నుండి వలస వచ్చిన బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేదలు ఇళ్ల స్థలాలు పొంది ఇక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అలా చెన్నకేశవనగర్ కాలనీ, నెహ్రూనగర్, వినాయకుని గుట్ట, అజాద్‌నగర్, రోప్ లైన్, కోడెల శివప్రసాద్ కాలనీ, లింగాపురం కాలనీ తదితర శివారు ప్రాంతాలు పెరిగాయి. అక్కడ నివసించే వారంతా రెక్కాడితే గాని డొక్కాడని కూలీలే. వీటిలో చాల కాలనీలు ఏర్పడి పదేళ్ల దాటింది. ఈ కాలనీల్లో తాగునీటి అవసరాలకు శాశ్వత పరిష్కరం లేకుండా తాత్కలికంగా బోర్లు వేసి నీటి సరఫరాతో పురపాలక సంఘం సరిపెట్టింది. అవి లేని చోట ట్యాంకర్లు ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు.





ట్యాంకర్ల వద్ద నీటి కోసం మహిళలు

గతేడాది ఈ ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది కూడా ఫిబ్రవరి నుండే ఎండలు ప్రతాపం చూపుతుండటంతో క్రమేణ భూగర్భజలాలు తగ్గిపోయి బోర్లు అడుగంటుతున్నాయి. ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసినా సమస్య పరిష్కారం చేయలేని స్థాయికి చాల ప్రాంతాల్లో నీటి సమస్య ఉంది. నూతన బోర్లు వేసినా నీరు పడే పరిస్థితులు లేవు. కూలీ పనులకు వేళ్లే వారు దూర ప్రాంతాలకు వెళ్లి నీరు మోసుకోలేక ఇబ్బంది పడుతున్నారు.

మాచర్ల పట్టణంలో సుమారు ఏడు వాటర్ ట్యాంక్‌ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. వాటి ద్వారా సుమారు 70 ట్రిప్పులు నీటి సరఫరా అవుతోంది. చెన్నకేశవనగర్ కాలనీకి చెందిన ప్రజలు కూలికి పోతు కాలనీలో ట్యాంకర్ ఆగే చోట ఇంటికి ఒక డ్రమ్ము పెట్టి వెళుతున్నారు. ట్యాంకర్ డ్రైవరు డ్రమ్ములను నింపి వెళతారు. కూలి పనుల నుండి సాయంత్రం వచ్చిన తరువాత ఆ నీటిని ఇళ్ళకు మోసుకుంటున్నారు. 20 ఏళ్ల క్రితం ఏర్పడిన కాలనీ అయినా ప్రతి ఏడాది తాగునీటి సమస్య తప్పడం లేదని కాలనీకి చెందిన మహిళలు సావిత్రి, జాన్‌బి వాపోయారు. మాచర్ల మున్సిపాల్టీకి తాగునీరు నిల్వ చేసుకునేందుకు అతి పెద్ద రిజర్వాయర్ అందుబాటులో ఉంది. నాగార్జునసాగర్ కుడి కాల్వ నుండి నీటిని రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేసుకునే అవకాశం ఉంది. నీరున్న శివారు కాలనీలకు తగినంత నీటి సరఫరా చేసేందుకు పైపులైన్లు ఏర్పాటు చేయకపోవటంతో ప్రతి ఏడాది నీటి సమస్యను శివారు ప్రాంత ప్రజలు ఎదుర్కోంటున్నారు.

గత ఐదేళ్లలో పట్టణ శివారు ప్రాంతాల్లో పలు జగనన్న కాలనీలు ఏర్పాటయ్యాయి. మాచర్ల పట్టణానికి తాగునీటి సమస్య పూర్తి పరిష్కారానికి బుగ్గవాగు తాగునీటి పథకం ఒకసారి ప్రారంభమై అగిపోగా, రెండవసారి శంకుస్థాపనతో సరిపెట్టారు. పాలకులు మారుతున్నా పట్టణానికి తాగునీటి సమస్యను పరిష్కరించడం లేదని ప్రజలు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలలో ప్రత్యేక డ్రైవ్ ద్వారా నీటి సరఫరాతో ఇబ్బందుల్లేకుండా చేయాలంటున్నారు.

ఎన్నికల్లో మళ్లీ గెలవడానికి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అరాచకాలు : బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి – మాచర్ల

ఎన్నికల కోడ్ వచ్చినా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రాక్షస పాలన కొనసాగుతోందని, ఎన్‌డిఎ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి, టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ధారునాయక్ విమర్శించారు. మంగళవారం రాత్రి వైసిపి నాయకుల దాడిలో గాయపడిన అచ్చమ్మకుంటకు చెందిన చక్రియానాయక్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వారు బుధవారం పరామర్శించారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ సిద్ధం సభకు రానన్నందుకు అచ్చమ్మకుంటలో టిడిపి కార్యకర్తపై దాడి చేసి గాయపర్చటం అమానుషమైన చర్యన్నారు. దాడికి పాల్పడిన గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ రామవత్ సర్వన్‌నాయక్, వాలెంటీరు రమేష్‌నాయక్, నరేష్‌నాయక్‌ను కఠినంగా శిక్షించాలని కోరారు. ఎన్నికల్లో మళ్లీ గెలవడానికి ఎమ్మెల్యే ఆరాచకాలకు పాల్పడుతున్నారని అన్నారు. జిల్లాకు నూతన ఎస్పీ వచ్చినా పరిస్థితి మారడం లేదన్నారు. అధికారులను ఈ ప్రాంతంలో ఎప్పటి నుండో పోలీసుశాఖలో పాతుకుపోయిన హోమ్ గార్డులు, క్రింది స్థాయి సిబ్బంది అధికారులను శాసిస్తున్నారని, సిబ్బంది ఎమ్మెల్యేకు అనుచరులుగా పని చేస్తున్నారని ఆరోపించారు. వీరిపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

స్ట్రాంగ్ రూములను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి – పెదకూరపాడు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్ట్రాంగ్ రూములు, అవసరమైన సౌకర్యాలపై ప్రత్యేక దష్టి సారించాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. నియోజకవర్గంలోని క్రోసూరు పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఇవిఎంల భద్రతా ప్రాంతాలను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటు, అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు కేటాయించిన స్ట్రాంగ్ రూములను, అక్కడు సదుపాయాలను పరిశీలించారు. లోపాలేమీ తలెత్తకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. పరిశీలనలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్ఒ) అయిన పులిచింతల ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ కందుల శ్రీరాములు, పెదకూరపాడు తహశీల్ధార్ ప్రభాకర్‌రావు, క్రోసూరు డిప్యూటీ తహశీల్ధార్ శ్రీనివాసరావు, రెవిన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మారుమూల తండాలో మాస్టారు

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పోటీ పరీక్షల్లో ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి – మాచర్ల రూరల్

టీచర్ ఉద్యోగమంటే పిల్లలకు పుస్తకంలోని పాఠాల వరకు చెప్పి కానిచ్చేయడం ఆ మాస్టారుకు అసలు ఇష్టం ఉండదు. చేసే పనికి సార్ధకత ఉండాలనే తపన ఆయనలో నిత్యం కనిపిస్తుంది. అందుకే విద్యాసంవత్సరానికి సంబంధించిన పాఠ్యాంశాలతోపాటు తన విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తూ 'మా మంచి మాస్టారు' అనిపించుకుంటున్నారు విశ్వనాథం మాస్టారు. ఏ సౌకర్యాలూ లేని ఆ ఊర్లో ఉద్యోగం చేయటమే ఒక సాహసమైతే. అలాంటిది అక్కడే నివాసం ఉంటూ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం తపన పడుతున్న ఉత్తమ గురువు గురించి..

మాచర్ల మండలంలోని లచ్చుంబావితండా (లక్ష్మీనారాయణపురం) మాచర్లకు 25 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. చుట్టూ నల్లమల అటవీ ప్రాంతం. పైగా టైగర్ ప్రాజెక్టు జోన్. ఆ తాండాలో మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలో దుప్పల విశ్వనాథం హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. తరగతి గదుల్లో పాఠ్యాంశాలు భోదిస్తూనే తమ విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ప్రత్యేక శిక్షణిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే మహాత్మ జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతులు సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. 2024–25 విద్యాసంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం గత ఫిబ్రవరిలో నోటిఫికేషన్ విడుదల కాగా ఈనెల 27న పరీక్షలు నిర్వహించనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ఒక యూనిట్‌గా 6 బిసి గురుకుల పాఠశాలున్నాయి. వీటిలో బాలురలకు మూడు, బాలికలు మూడు పాఠశాలు ఉన్నాయి. వీటిలో ప్రవేశానికి 4వ తరగతికి చెందిన తమ పాఠశాలలలోని విద్యార్థులకు విశ్వనాథం మాస్టారు తర్ఫీదు ఇస్తున్నారు. ఈ ప్రవేశ పరీక్షలకు 18 మందిని సిద్ధం చేస్తున్నామని, గత నెలలో జరిగిన అంబేద్కర్ గురుకులాల ప్రవేశానికి ఐదుగురు విద్యార్థులు తమ పాఠశాల నుండి అర్హత సాధించారని విశ్వనాథం తెలిపారు.



లచ్చుంబావి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న విశ్వనాథం మాస్టారు

కార్పొరేట్, మతోన్మాద బిజెపిని ఓడించాలి

సిపిఎం రాష్ట్ర నాయకులు వి.కృష్ణయ్య

పేదలకు పట్టాలివ్వడంలో ప్రభుత్వాలు విఫలం : జొన్నా శివశంకరరావు

ప్రజాశక్తి - మంగళగిరి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కార్పొరేట్ మతోన్మాద బిజెపిని ఓడించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి కృష్ణయ్య పిలుపునిచ్చారు. బుధవారం మంగళగిరి సిపిఎం కార్యాలయంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం ఎం రవి అధ్యక్షతన జరిగింది. కృష్ణయ్య మన ప్రసంగాను కొనసాగిస్తూ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన బిజెపితో జతకట్టిన టిడిపిని, జనసేన పార్టీలను ఓడించాలన్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసే మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావు గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతూ నిరంకుశంగా వ్యవహరిస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఓడించాలని అన్నారు. పార్లమెంట్లో సిఎఎకు మద్దతు తెలిపిన టిడిపి, వైసిపి పార్టీల విధానాలను ఆయన విమర్శించారు. దేశ వ్యాప్తంగా పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను అదుపు చేయలేని స్థితిలో కేంద్ర ప్రభుత్వం ఉందని అన్నారు. రైతాంగ వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో నిత్యం ప్రజల కోసం పనిచేసే సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. అనేక ప్రజా ఉద్యమాల్లో సిపిఎం పోరాటాలు నిర్వహించి అనేక సమస్యలను ఈ నియోజకవర్గంలో పరిష్కరించడం జరిగింది అని అన్నారు. అధికార వైసిపి, ప్రతిపక్ష టీడీపీ పార్టీలు ఈ నియోజకవర్గంలో 20వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సి ఉండగా అధికారంలో ఉన్నప్పటికీ ఈ రెండు పార్టీలు మోసం చేశాయని విమర్శించారు. ఎన్నికలు వచ్చినప్పుడు ఆ పార్టీలకు ఇళ్ల పట్టాల సమస్య, పేదల గురించి మాట్లాడి మోసం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో మంగళగిరి నియోజకవర్గం ఇండియా బ్లాక్ వేదిక అభ్యర్థి జొన్న శివశంకరరావు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై నేతాజీ, ఎస్ఎస్ చెంగయ్య, ఈమని అప్పారావు, కె నళిని కాంత్, ఎన్ భావన్నారాయణ, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ చిస్టీ, సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, మంగళగిరి, తాడేపల్లి పట్టణ కార్యదర్శులు వై కమలాకర్, బి వెంకటేశ్వర్లు, తాడేపల్లి మండలం రూరల్ కార్యదర్శి డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వి కృష్ణయ్య



మాట్లాడుతున్న సూర్యారావు

ప్రజాశక్తి-తాడేపల్లి : మంగళగిరి నియోజకవర్గ పరిధిలో 20 వేల మందికి నివాస భూములు ఇప్పించిన ఘనత సిపిఎందని ఇండియా కూటమి మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థి జొన్నా శివశంకర్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2014లో టిడిపి అధికారంలో ఉండగా మంత్రిగా ఉన్న లోకేష్ కానీ, 2019లో వైసీపీ తరుపున మళ్లీ గెలిచిన ఆళ్ల రామకష్ణారెడ్డి కానీ ప్రతిపక్షాలలో ఉన్నప్పుడు సిపిఎంతో కలిపి ఆందోళనలు చేశారే కానీ అధికారంలోకి వచ్చాక పేదవారికి ఒక్క పట్టా కూడా ఇప్పించలేకపోయారని విమర్శించారు. నేడు 20 వేల మందికి పట్టాలిస్తారని లోకేష్ హామీ ఇస్తున్నారని, 2014 నుంచి 19 వరకు ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. 2019 నుండి 2024 వరకు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం పేదలకు పట్టాలివ్వడంలో ఎందుకు విఫలం చెందిందన్నారు. కష్టకాలంలో, ఇబ్బందుల్లో పేదలకు అండగా నిలిచింది సిపిఎం మాత్రమేనని అనా నరు. ఉద్యమాలు చేస్తూ సిపిఎం నాయకులు జైళ్లకు సైతం వెళ్లారన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో ఎర్రజెండాను గెలిపిస్తేనే పేదలకు అండని అన్నారు. నియోజకవర్గంలో 20 వేల ఇళ్లను రెగ్యులర్ చేసుకొని ఎక్కడ నివాసం ఉంటున్నారో అక్కడే వారికి పట్టాలు పొందాలంటే ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. **ప్రజాశక్తి-తాడేపల్లి :** ఇండియా వేదిక తరపున కాంగ్రెస్‌తో పాటు 42 పార్టీలు బలపర్చిన మంగళగిరి నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు, గుంటూరు పార్లమెంట్ సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్‌లను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, సిపిఎం తాడేపల్లి పట్టణ నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి కోరారు. బుధవారం రాత్రి పట్టణంలోని సుందరయ్యనగర్, అంజిరెడ్డికాలనీల్లో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. వామపక్ష అభ్యర్థులను గెలిపించడం ద్వారా ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమాల్లో కొట్టె కరుణాకరరావు, పి.రామచంద్రరావు, బి.రామారావు, వి.చంద్రశేఖర్, కొండబాబు, నాగరాజు, వెంకటేశ్వరరావు, పి.దశరథరామిరెడ్డి, డి.యోహాన్, ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు రైతుల్ని ఆదుకోవాలి

శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్య నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి తెనాలి : రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు భద్రత లేకుండా వ్యవహరించిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య, గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో దాదాపు రెండు నెలల క్రితం సంభవించిన అగ్ని ప్రమాదంలో సుమారు రూ120 కోట్ల విలువైన పసుపు దగ్ధమైన సంగతి తెలిసిందే. అయితే కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం నిర్లక్ష్యం ఈ ప్రమాదానికి, రైతులు నష్టపోవడానికి కారణమని వారు అన్నారు. ప్రభుత్వం నియమించిన కమిటీ నివేదిక ఆధారంగా నష్టపోయిన రైతాంగానికి క్వింటాల్కు రూ 12,500 చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. ప్రమాదం జరిగి రెండు నెలలు కావస్తున్న ఈ యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన లేదని, యాజమాన్యం తప్పించుకునే ధరణిలో వ్యవహరిస్తుందని, దానికి ఆస్కారం లేకుండా కోల్డ్ స్టోరేజ్ ఆస్తులు తాకట్టుకు గాని, విక్రయానికి గాని అవకాశం లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరుతూ సబ్ కలెక్టర్ ప్రకర్ జైన్ ను కోరారు. బీమా సొమ్ము ముందు రైతులకు చెల్లించిన తర్వాతే యాజమాన్యానికి చెల్లించే విధంగా కూడా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన ఆయన ప్రమాదానికి సంబంధించి ఇంకా రెండు నివేదికలు రావాల్సి ఉందని, రైతులు కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం పరస్పర చర్చలకు చొరవ చూపుతానన్నారు. జిల్లా కలెక్టర్‌కు కూడా రైతాంగ సమస్యను వివరిస్తామన్నారు. కార్యక్రమంలో నాదెళ్ల చంద్రశేఖర్, గద్దె శ్రీహరి, మందాళ ప్రదీప్ రెడ్డి, కళ్ళం శ్రీనివాస్ రెడ్డి, యు హనుమాన్ ప్రసాద్ పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



సిబ్బందిని అభినందిస్తున్న కమిషనర్

సిబ్బందికి ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి-తాడేపల్లి :2023 - 24 ఆర్థిక సంవత్సరంలో మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ఇంటి పన్ను, ఖాళీ స్థలం పన్ను వసూళ్లలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విన్యూ ఆఫీసర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్‌లకు, పంచాయతి సెక్రటరీలకు, సచివాలయ సిబ్బందికి ఎంటిఎంసి కమిషనర్ కమిషనర్ నిర్మల్‌కుమార్ అభినందించారు. బుధవారం ఎంటిఎంసి జోనల్ కార్యాలయంలో సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎటువంటి అలసత్వం లేకుండా ప్రతి ఒక్కరూ తమ ఉద్యోగ ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించాలని తెలిపారు. అదేవిధంగా ప్రస్తుతం 2024-2025 ఏడాదికి ముందస్తు పన్ను చెల్లింపుపై ఐదు శాతం రాయితీతో ఇంటి పన్ను వసూళ్లు సక్రమంగా చెల్లించేలా చూడాలన్నారు.

భిన్నత్వంలో ఏకత్వం భారతదేశం

ప్రజాశక్తి-తాడేపల్లి :విభిన్న జాతులు, మతాలతో భిన్నత్వంలో ఏకత్వంగా భారతదేశం విరాజిల్లుతుందని అమరావతి ఐకాన్ మిత్ర బృందం సభ్యులు పిన్నమనేని మురళీకృష్ణ చెప్పారు. కేంద్రంలోని పాలక పార్టీ దేశంలో మతాలు, కులాలు మధ్య అలజడి సృష్టిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రంజాన్ సందర్భంగా అమరావతి ఐకాన్‌లో బుధవారం మిత్ర బృందం తరపున ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ దేశంలో 29 సాంస్కృతిక వారసత్వ పండుగలు ఉన్నాయని, ప్రజలు వాటన్నంటినీ అందరూ కలిసిమెలిసి జరుపుకోవాలని ఆకాంక్షించారు. మతసామరస్యం పరిడివిల్లే విధంగా అమరావతి ఐకాన్‌లో అన్ని రకాల పండుగల జరుగుతున్నాయని చెప్పారు. స్వాతంత్ర పోరాటంలో కులమతాలకు అతీతంగా పెద్దఎత్తున ప్రజానీకం పాల్గొన్నారని, అదే స్ఫూర్తితో నేడు కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మిత్ర బృందం సభ్యులు వై.అచ్యుతరావు, వై.బాలకృష్ణ, ఇ.రాజశేఖర్, వై.సుబ్బారావు, రియాజ్ బాష, తదితరులు పాల్గొన్నారు.

నెక్కల్లులో జయహో బీసీ

ప్రజాశక్తి - తుళ్లూరు :మండల పరిధిలోని నెక్కల్లులో టిడిపి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పది అంశాలతో టిడిపి డిక్లరేషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. బిసి ప్రత్యేక రక్షణ చట్టం, బిసి సబ్ ప్లాన్ ద్వారా ఐదేళ్ళలో రూ లక్షన్నర కోట్లు వ్యయం చేయడం, సామాజిక న్యాయ పరిశీలనా కమిటీ ఏర్పాటు తదితర హామీల అమలు టిడిపి తోనే సాధ్యమని బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ధల సదాశివరావు, గుమ్మా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. వైసిపి మూడు రాజధానులు అంటూ వైసిపి డ్రామాలు ఆడిందని, అమరావతి నిర్మాణం జరగాలంటే చంద్రబాబు అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.బిసి లను వైసిపి ప్రభుత్వం అన్నివిధాల మోసం చేసిందని మండిపడ్డారు.బిసి ల అండతోనే ఏ ప్రభుత్వ మైనా అధికారం లోకి వస్తుందని, అందరూ ఐక్యంగా ఉండి కూటమి అభ్యర్థులను గెలిపించు కోవా లన్నారు. తొలుత బిసి సంఘం నాయకులు గుమ్మా వేంకటేశ్వర రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలోపలువురు బిసి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎం పకీరయ్య తదితరులు

ఎమ్మెల్యే ప్రకటనకు సిపిఎం ఖండన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని ఆత్మకూరులో గత సోమవారం స్థానిక కొబ్బరితోట ప్రాంతంలోని టిడిపి, సిపిఎం సానుభూతిపరులైన 50 కుటుంబాలు వైసిపిలో చేరారంటూ స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సోషల్ మీడియా ద్వారా చేసిన ప్రకటన పచ్చి అబద్ధమని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.పకీరయ్య ఖండించారు. ఆత్మకూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. కొబ్బరితోట ప్రాంతంలోని కుటుంబాలేవీ వైసిపిలో చేరలేదని, ఇతర ప్రాంతాల వారిని పదిమందిని తెచ్చి స్థానిక ఏడో బజారులో వైసిపి కండవాలు కప్పారని, ఇది నైతికంగా దిగజాడుతనమేనని విమర్శించారు. రాష్ట్రంలో, దేశంలో టిక్కెట్లు రాకపోయేసరికి ఒక పార్టీ నుండి ఇంకో పార్టీలోకి తేలిగ్గా మారుతున్నారని, అయితే ఆ తరహాలో సిపిఎం కార్యకర్తలు, అభిమానులు మారబోరని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న వ్యక్తి ఒక గల్లీ నాయకుని మాటలు నమ్మి మాట్లాడడం సబబు కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శులు వుద్దంటి దుర్గారావు, గడ్డం అజయ్ కుమార్, వద్ది సురేష్, చిట్టేల సీతారామాంజనేయులు ఆనందం బాబ్జి, వద్ది సుబ్రహ్మణ్యం, బిట్రా రాంబాబు, దేపూరు శర్మ పాల్గొన్నారు.



ఇంటివద్దే ఓటుకు 22లోపు నమోదు చేయాలి

రాజకీయపార్టీల సమావేశంలో జెసి రాజకుమారి

ప్రజాశక్తి - మంగళగిరి :ఇంటి వద్దనే ఓటు వేయాలనుకునే వారు 22వ తేదీలోపు పిడబ్ల్యుడి ఓటర్లు తప్పనిసరిగా ఓటర్ల జాబితాలో పిడబ్ల్యుడి ఓటరుగా నమోదు అయి ఉండాలని మంగళగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జి రాజకుమారి తెలిపారు. బుధవారం మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం జరిపారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ 85 సంవత్సరాలు పైబడిన వారికి, వికలాంగులకు ఇంటి వద్దనే ఓటు వేసే వెసులుబాటు కల్పించబడిందని, వారందరికీ ఫారం -12డి బీఎల్వోల ద్వారా ఇప్పటికే పంపిణీ చేశామని తెలిపారు. హోం ఓటింగ్‌కు అర్హులు 22వ తేదీ సాయంత్రం లోగా రిటర్నింగ్ అధికారి కార్యాల యంలో సమర్పించాలన్నారు. ఫారం 6, ఫారం 8 దరఖాస్తు చేసుకున్న వారందరికీ పరిశీలించి అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించడం జరుగుతుందని తెలిపారు.

వైసిపి అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి పట్టణంలోని 17వ వార్డులో బుధవారం మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి వైఎస్ఆర్సిపి తరపున పోటీ చేస్తున్న మురుగుడు లావణ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి :వైసిపి గుంటూరు పార్లమెంటు అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం సీతానగరం 20వ వార్డు, 14వ వార్డు సచివాలయ పరిధిలో బాలసాని.బత్తుల దాస్, పద్మ ఆధ్వర్యంలో వైసిపి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి నాయకత్వంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా జెసిఎస్ అధ్యక్షులు ఈదులమూడి డేవిడ్‌రాజు, దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి. మేకా వెంకటరామిరెడ్డి, మేడ వెంకటేశ్వర (పండు), కనకదుర్గమ్మ గుడి ప్రత్యేక ఆహ్వానితులు జక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కళ్లం రాజశేఖర్‌రెడి తదితరులు పాల్గొన్నాం

'మేమంతా సిద్ధం'కు బస్సులు .. కూలీల పాట్లు

- పలు గ్రామాలకు ఆగిన బస్సులు
- ఇబ్బందిపడ్డ ప్రయాణికులు
- కూలి పోగొట్టుకున్నాం: రోజువారి కూలీల ఆవేదన

ప్రజాశక్తి..చిలకలూరిపేట



ఎండ తీవ్రతకు రోజు వారీ కూలీలకు పనులు అంతంతం మాత్రంగానే ఉంటున్నాయి. దీనికి తోడు 'మేమంతా సిద్ధం' సభలకు ఆర్టీసి బస్సులు వెళుతుండటంతో ప్రతి పల్లె నుంచి చిలకలూరిపేటకు వచ్చి కూలి చేసుకునే వారికి బస్సులు అందుబాటులో ఉండటం లేదు. బుధవారం పిడుగురాళ్ల వద్ద 'మేమంతా సిద్ధం' ఉండటంతో బస్సులు అందుబాటులో లేకపోవడంతో కూలి పనులకు వెళ్లలేకపోయామని చిలకలూరిపేట మండలంలోని పలు గ్రామాల కూలీలు వాపోతున్నారు. ప్రతి పల్లె నుంచి చిలకలూరిపేటకు వచ్చి కూలి చేసుకునే సుమారుగా వెయ్యి,పది హేను వందల మందికి పైగా పల్లె కూలీలకు కూలి పనులు లేకుండా పోయాయి. చిలక లూరిపేట నుంచి సూరవరపుపల్లె, అనంతవరం, యణమదల, యద్దనపూడి, గన్నవరం, పూనురు వరకు ప్రత్యేకంగా స్థానిక కళా మందిర్ సెంటర్ వద్ద గల పూనూరు వైపు వెళ్లే బస్టాండ్ పాయింట్ వద్ద నుంచి నిత్యం మూడు బస్సులు ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు చేరుస్తుం టాయి. బస్సు సౌకర్యం ఉన్న ఆయా గ్రామాల నుంచి ఉదయం 6 గంటల బస్సుకు రోజు వారీ కూలీలను చిలక లూరిపేటకు తీసుకువస్తుంటాయి. పూనూరులో ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే బస్సు లేకపోతే కనుక ఇక ఆ రోజున కూలీలకు పనులు లేనట్టే. మోటారు సైకిల్ పై వెళ్లే కన్నా బస్సులో తక్కువ చార్జీలు కనుక కూలి పనులకు వెళ్లే ప్రతి ఒక్కరు బస్సులో వెళ్లేందుకే సుముఖత చూపుతారు. అదేవిధంగా, సాయంత్రం చిలకలూరిపేట నుంచి ఆయా గ్రామాలను కలుపుతూ వెళ్లే బస్సు సౌకర్యంగా ఉండటంతో వారికి ప్రత్యామ్నాయం ఆలోచించాల్సిన అవసరం లేకుండా పోయింది. బుధవారం నాడు ఆయా రూట్లలోని మూడు బస్సులను 'మేమంతా సిద్ధం'కు పంపించారు. దీంతో , ఆయా గ్రామాల ప్రజలు కూడా బస్సులు లేక ఇబ్బంది పడ్డారు. అదే మాదిరి చిలకలూరిపేట డిపో నుంచి వినుకొండ, కొప్పుర్రు, ఫిరంగిపురం, ఇంకొల్లు, కుందుర్రు తదితర గ్రామాలకు వెళ్లే బస్సులు ఆగిపోవడంతో ఆ గ్రామాల్లో నిత్యం కూలీ చేసుకునే వాళ్ళు ఇబ్బందులు పడ్డారు.

40 బస్సులు అద్దెకిచ్చాం

చిలకలూరిపేట డిపో మేనేజర్ రాంబాబు మాట్లాడుతూ డిపోలో మొత్తం 72 బస్సులు ఉంటే, వాటిలో 40 బస్సులను అద్దెకు ఇచ్చినట్లు చెప్పారు. మిగిలిన బస్సులను గుంటూరు, నరస రావుపేట, చిలకలూరిపేట రూట్లలో తిరుగుతున్నాయన్నారు. పైఅధికారులు చెప్పినట్లు తాము చేస్తున్నట్లు చెప్పారు. అదనకిచ్చిన ఈ 40 బస్సుల కండక్టర్లకు సెలవులు ఇచ్చారని, రోజు జీతం తగ్గిస్తారని ఓ కండక్టరు చెప్పారు.

మండుటెండలో ప్రయాణికుల పడిగాపులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ముఖ్యమంత్రి సభకు బస్సులు తరలి వెళ్లడంతో ప్రయాణికులు మండుటెండలో పడిగాపులు కాశారు. ఉగాది పండగకు సొంత ఊళ్లకు వచ్చిన ప్రజలు తిరిగి వెళ్లేందుకు బస్సులు లేకపోవడంతో ఇక్కట్లు పడ్డారు. సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుండి సుమారు 35 బస్సులు 'మేమంతా సిద్ధం' సభకు వెళ్లాయి. బస్సుల కోసం ఎండలో పిల్లాపాపలతో వేచి ఉన్నారు. ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పలేదు. ఆర్టీసీ అధికారుల తీరుపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు



సత్తెనపల్లిలో ఎండలో పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు



రచ్చమల్లపాడులోనిర్వహిస్తున్న సమావేశం

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

వెల్దుర్తి మండల పరిధిలోని రచ్చమల్లపాడులో వాటర్ ఎయిడ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం నీటి వినియోగదారుల సంఘాల సమావేశం జరిగింది. సమావేశానికి ముందు మంచి నీటి ట్యాంకు పనితీరును బ్లాక్ కోఆర్డినేటర్ మాడెబోయిన గురు ప్రసాద్, సిఫ్ రవి వర్మలు పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురు ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని, వినియోగించిన నీటిని, వాననీటిని ఎక్కడికక్కడ భూమి లోపలకి ఇంకేలా చేయాలని తెలిపారు. గత పదేళ్లుగా భూగర్భ జల మట్టం తగ్గుతుందని, మట్టం తగ్గకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలను పొలాల్లో , ఇంటి దగ్గర ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఇప్పటికే ఈ గ్రామంలో ఐదు వాననీటి పరిరక్షణ నిర్మాణలను నిర్మించినట్లు చెప్పారు. నీటి సంఘాల సభ్యులు చిన్న కోటయ్య, కనకంబరం, ప్రకాష్, వెంకయ్య,రోజా, దాసు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి భార్య డాక్టర్ సుస్మిత

'నా భర్తకు మరో అవకాశం ఇవ్వండి'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఇప్పటకే రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిపించిన తన భర్తను ప్రజలకు సేవ చేసేందుకు మరో అవకాశం ఇవ్వాలని, సంక్షేమ వైసిపికి పట్టం కట్టాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి భార్య డాక్టర్ సునీత కోరారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని 21,22 వార్డులలో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా వార్డులలో ఇంటింటికి తిరిగి నవరత్నాలు పేరిట జరిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుస్మిత మాట్లాడుతూ ప్రజలకు నేరుగా సంక్షేమ ఫలాలు అందాలంటే మళ్ళీ జగన్ ప్రభుత్వం రావాలని అన్నారు. అర్హతే కొలమానముగా ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, యువత భవిష్యత్తు మెరుగుపడాలంటే వైసిపి ద్వారా సాధ్యమని, విద్య, వైద్య, ఆరోగ్యం పట్ల జగన్ ప్రభుత్వంలో ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు.

అరటికాయలతో వీరాంజనేయునికి అలంకారం

ప్రజాశక్తి - కారంపూడి



స్థానిక శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయం ఎదురుగా ఉన్న వీరాంజనేయ - షిరిడి సాయి మందిరం లో ఆంజనేయస్వామి నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభ మయ్యాయి. రెండవ రోజు అరటి కాయలతో వీరాంజనేయ స్వామిని అలంకరించారు. ఆలయ మహిళా కమిటీ చైర్మన్ కోట లక్ష్మీ సుజాత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సందర్శకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఉగాది నుండి శ్రీరామ నవమి వరకు తొమ్మిది రోజులపాటు ఈ ఉత్సవాలను నిర్వహిస్తామని కోట లక్ష్మీ సుజాత తెలిపారు.



నూజెండ్ల మండలంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు

ఓటుతో బుద్ధి చెప్పండి : ఎంపి

ప్రజాశక్తి - నూజెండ్ల

నూజెండ్ల మండల కేంద్రంలో, మండలంలోని ఉప్పలపాడు, పమిడిపాడు ఖమ్మంపాడు,తెల్లపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ఉమ్మడి పార్లమెంటు అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి జీవి ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు , ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పలు గ్రామాల్లో బుధవారం పర్యటించారు. గ్రామస్తులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శ్రీకృష్ణదేవరాయులు మాట్లాడుతూ అహంకారంతో విర్రవీగుతున్న బొల్లా బ్రహ్మనాయుడుకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని అన్నారు. తాము అధికారంలోకి వస్తే ఉప్పలపాడు ప్రజల కోరిక మేరకు రైతులకు ఉప యోగపడేలా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి పట్టాలెక్కాలన్నా, గ్రామాలు తిరిగి కోలుకోవాలన్న చంద్రబాబే సరైన వ్యక్తి అని అన్నారు. జీవి ఆంజనేయులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అభివృద్ధి నినాదమే తెలుగుదేశం పార్టీని గెలుపు తీరాలకు చేర్చబోతోందని అన్నారు.

అత్యధికంగా నష్టపోయింది పేదలే

ప్రజాశక్తి-చిలకలూరిపేట

అయిదేళ్ల జగన్ పాలనలో అత్యధికంగా నష్టపోయింది పేదలేనని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. స్థానిక 12వ వార్డులో బుధవారం కుటుంబ సాధికార సారథులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం పుల్లారావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో కూడా వైసిపి చేసిన అన్యాయం, మోసాలపై వ్యతిరేకత ఉందని అన్నారు.



చిలకలూరిపేటలో నాయకులు, కార్యకర్తలతో ప్రత్తిపాటి పుల్లారావు



'ఓటు అడిగే హక్కు జగన్‌కు లేదు'

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

పల్నాడు జిల్లా ప్రజలను ఓటు అడిగే హక్కు జగన్మోహన్ రెడ్డికి లేదని సత్తెనపల్లి నియోజకవర్గం టిడిపి,జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లిలోని రఘురాం నగర్ లో కన్నా క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాను ఏ మాత్రం అభివృద్ధి చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 135 సంక్షేమ పథకాలకు అమలు చేసి వాటికి రాష్ట్రాలకు నిధులు కేటాయిస్తే, జగన్ 9 పథకాలను మాత్రమే అమలు చేసి నిధులు దారి మళ్ళించారని ఆరోపించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి యెలినేడి రామస్వామి, టిడిపి నాయకులు పూజల వెంకట కోటయ్య, జానీ ఖాజావలి, ఆతుకూరి శివనాగేశ్వరరావు, జనసేన నాయకులు తవిటి భవనారాయణ, సిరిగిరి శ్రీనివాస రావు, బిజెపి నాయకులు కట్టా శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

చర్చి ప్రారంభోత్సవం

సత్తెనపల్లి మండలం నందిగంలో తెలుగు బాప్టిస్ట్ చర్చ్ ప్రారంభోత్సవంలో కన్నా లక్ష్మీనారాయణ బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారా యణను చర్చి నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్య క్షులు ఆళ్ళ అమరేశ్వర రావు పాల్గొన్నారు.

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైసిపి నాయకులు, నరసరావుపేటలో ప్రముఖ లాయర్, నోటరీ గా సేవలందిస్తున్న మోర ప్రతాప్‌రెడ్డి కుటుంబ సభ్యులు, ఆయన అనుచరులు బుధవారం టిడిపిలో చేరారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు సమక్షంలో ప్రముఖ వ్యాపారవేత్త కపలవాయి విజయ్ కుమార్,ప్రముఖ అడ్వకేట్ దేశిరెడ్డి చిన్నపరెడ్డి నేతృత్వంలో వారు టిడిపిలో చేరారు.



కారంపూడిలో జూలకంటి ప్రచారం

ప్రజాశక్తి - కారంపూడి

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా కారంపూడిలో జూలకంటి బ్రహ్మనందరెడ్డి పర్యటించారు. అంకాలమ్మ తల్లి దేవాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం దేవాలయం సెంటర్ నుండి ఎన్నికల ప్రచారాన్ని బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
గురువారం 11 ఏప్రిల్ 2024

పకడ్బందీగా ఎన్నికల నియామావళి అమలు

రాజకీయ పార్టీలతో సమావేశంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నియమావళిని పకడ్బందిగా అమలు చేయటం జరుగుతుందని, నియమావళి ఉల్లంఘనలపై ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి రాజకీయ పార్టీలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కోడ్ ఉల్లంఘించినందుకుగాను 128 మంది వాలంటీర్లను తొలగించామని, ఐదుగురు కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఆరుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఇద్దరు రెగ్యూలర్ ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. 520 మంది వాలంటీర్లు రాజీనామ చేశారని తెలిపారు. ఎన్నికల సంఘానికి చేసిన 52 ఫిర్యాదులలో 51 ఫిర్యాదులపై నివేదిక అందించామని, మిగిలిన ఒక పిర్యాదు విచారణ జరుగుతుందన్నారు. సీవిజిల్ ద్వారా అందిన 168 పిర్యాదులలో 161 ఫిర్యాదులను 100 నిమిషాల్లోపే పరిష్కరించారని, కేవలం ఏడు పిర్యాదులు 100 నిమిషాలు దాటిన తరువాత పరిష్కరించినట్లు చెప్పారు. జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులలోను, ఫ్లైయింగ్ స్వాడ్‌లు నిర్వహించిన తనిఖీలలో ఇప్పటి వరకు రూ.3.197 కోట్ల నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేశారన్నారు. కుటుంబ అవసరాల కోసం తీసుకువెళుతున్న నగదు, వస్తువులను తనిఖీ బందాలు సీజ్ చేస్తే సామన్య ప్రజలు ఇబ్బంది పడకుండా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ రిడ్రసెల్ కమిటీకి దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి 24 గంటల్లోనే రిలీజ్ అర్డర్ జారీ చేయటం జరుగుతుందన్నారు. జిల్లాలో ప్రచార అనుమతుల కోసం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 74 ధరఖాస్తులు అందించగా 55 అనుమతులు మంజూరు చేశామని, 16 తిస్కరించామని, 3 పరిశీలనలో ఉన్నాయన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 867 దరఖాస్తులు అందించగా 608కి అనుమతులు మంజూరు చేశామని, 159 తిరస్కరించామని, 88 పరిశీలనలో ఉన్నాయన్నారు. ప్రచార ర్యాలీలో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విభిన్న ప్రతిభావంతులు, బాలింతలు, గర్భిణీ మహిళలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు, పోలింగ్ బూత్‌లలోకి సెల్ ఫోన్లు అనుమతించరని ఓటరు స్లిప్ పంపిణీ సమయంలో బూత్ లెవల్ అధికారులు ఓటర్లు అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. సమావేశంలో జేసీ రాజకుమారి, నగర కమిషనర్ కీర్తి చేకూరి , తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, డిఆర్ఒ పెద్దిరోజా, వివిధ పార్టీల తరపున డాక్టర్ టి.సేవాకుమార్, సిహెచ్.వాసు, పద్మనాభరావు, వై కృష్ణకాంత్, బిళ్ళా సునీల్, కంచర్ల శివరామయ్య, అత్తోట జోసఫ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

అంగన్వాడీ కేంద్రం సందర్శన

ప్రజాశక్తి - కొల్లిపర

చిన్నారులకు గర్భిణులకు పోషకాహారం అందించాలని లక్ష్యంతో ప్రభుత్వము అంగన్వాడీ కేంద్రాలను నిర్వహిస్తుందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి పద్మావతి అన్నారు బుధవారం మండలంలోని వల్లభాపురంలో అంగన్వాడీ కేంద్రాలను, ప్రైమరీ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పౌష్టికాహారం సక్రమంగా చిన్నారులకు గర్భిణీలకు అందుతున్నాయా లేదా అని మెనూ ప్రకారం స్పాట్ ఫీడింగ్ ఇస్తున్నారా లేదా అని తల్లులని అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం కనుక ఎండ తీవ్రత దృష్టిలో పెట్టుకొని గర్భిణీలకు చిన్నారులకు ఆరోగ్యపరంగా ఆమె పలు సలహాలు సూచనలు చేశారు . ఆకుకూరలు ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా తీసుకోవాలని తల్లులకు సూచించారు. గైర్ హాజరవుతున్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బాల్య వివాహాల నిరోధానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశాలపై బాలికలకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ అవగాహన కల్పిస్తుందని ఆమె పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకై రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బాల కార్మికులను గుర్తించినట్లయితే వారిని బడిలో పంపేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె అంగన్వాడి కేంద్రాల్లో, పాఠశాలలో హాజరు పట్టిక రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సాల్మన్ రాజు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమన్నారాయణ, అంగన్వాడి సూపర్వైజర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న బి పద్మావతి

కవి సమ్మేళనానికి విశేష స్పందన

ప్రజాశక్తి - తెనాలి

ఉగాది సందర్భంగా పట్టణానికి చెందిన అభ్యుదయ కళా సమితి ఇసుక సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట అతిథి హెూటల్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం కవి సమ్మేళనం నిర్వహించారు. 40 మంది కవులు పాల్గొని ఉగాది కవితలు వినిపించారు. చిన్నారులు ఉగాది రూపకం, లలిత సంగీత విభావరి నిర్వహించారు. అలాగే సాంస్కృతిక జానపద కళారూపాలపై చర్చ గోష్టి జరిగింది. కార్యక్రమంలో సిహెచ్ అనురాధ కన్నెగంటి మౌనిక, బెజ్జంకి నాగమణి, నీలాంబ్రం, విజయ సారధి కవితా పఠనం చేశారు. డాక్టర్ రంగశెట్టి రమేష్, ప్రొఫెసర్ బి లలితానంద ప్రసాద్, డాక్టర్ అయినల మల్లేశ్వరరావు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంవీవి భీమేశ్వర ప్రసాద్, విజయ సారథి, రఘునాథరావు, పొన్నపల్లి గోపాలకష్ణమూర్తి, ప్రేమ్ కుమార్ కృష్ణారావు బొల్లిమంత కృష్ణ పాల్గొన్నారు.



పాల్గొన్న కవులు, రచయితలు

మణిపాల్‌లో నర్సింగ్ సిబ్బందికి భద్రతా చర్యలపై అవగాహన

ప్రజాశక్తి-తాడేపల్లి

మణిపాల్ ఆసుపత్రి సిబ్బందిలో భద్రతపై అవగాహన పెంచేందుకు 'ఎయిమ్ ఫర్ సేఫ్టీ' కార్యక్రమాన్ని బెక్టన్ డికిన్సన్ ఇండియాతో కలిసి బుధవారం ఆసుపత్రిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 250 మంది నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మణిపాల్ ఆసుపత్రి క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి మాట్లాడుతూ అధునాతన భద్రతా చర్యలు, ఈ దిశలో తీసుకోవలసిన జాగ్రత్తలపై నర్సింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. సాంకేతిక పురోగతులు, వినూత్న సంరక్షణ విధానాలు, ప్రపంచ సంఘటనల ప్రభావంతో నర్సింగ్ రంగం నిరంతరం రూపాంతరం చెందుతోందన్నారు. అధిక-నాణ్యత సంరక్షణను అందించడానికి, నర్సులతో సహా ఆరోగ్య సంరక్షణ నిపుణులు అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ పోకడలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలన్నారు. 'ఎయిమ్ ఫర్ సేఫ్టీ' ప్రోగ్రామ్ కోసం బెక్టన్ డికిన్‌సన్ ఇండియాతో భాగస్వామ్యం కావడం సిబ్బంది, రోగుల ఆరోగ్యం, భద్రతను రక్షించడంలో తమ అంకితభావాన్ని తెలియజేస్తుందన్నారు. మణిపాల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.ఉత్తమ్ శర్మ మాట్లాడుతూ సంస్థలో సిబ్బంది, రోగుల భద్రతకు తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంఓల నర్సింగ్ సూపరింటెండెంట్ బి వసంత, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ మనోజ్ కుమార్, ఇంటెన్సివిస్ట్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, మైక్రోబయాలజిస్ట్ డాక్టర్ పి శిరీష, బీడీ మేనేజర్ డాక్టర్ బి. సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వైద్యులు



టిఎన్‌టియుసి నేత నాగగౌడ్ రాజీనామా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి నాయకులకు బిసిలంటే చిన్నచూపుగా ఉందని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు దొంతా నాగగౌడ్ మండిపడ్డారు. ఆయనతోపాటు ఆయన సతీమణి, 25వ డివిజన్ కార్పొరేటర్‌గా గత ఎన్నికల్లో పోటీ చేసిన దొంతా సుశీల ఇద్దరూ టిడిపికి, పార్టీ పదవులకు రాజీనామా చేశారు. ఇటీవలే జనసేనలోని పరిణామాలపై ఆగ్రహం వ్యక్తం చేసిన జనసేన రాష్ట్ర కన్వీనర్ వీరిశెట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ దంపతులిద్దరూ బుధవారం మంత్రి విడదల రజినిని స్థానిక చంద్రమౌళి నగర్‌లోని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో కలిశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జనసేన పార్టీ రాష్ట్ర కన్వీనర్ వీరిశెట్టి సుబ్బారావుతోపాటు దొంతా దంపతులిద్దరూ మాట్లాడారు. దొంతా నాగగౌడ్ మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీలో బీసీలకు గౌరవం లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. పార్టీ కార్యక్రమాలకు కనీసం పిలుపుకూడా ఉండటం లేదన్నారు. తనపై బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పార్టీ కోసం 30 ఏళ్లుగా కష్టపడి పనిచేస్తున్నా కనీసం గౌరవం ఉండటం లేదని సుశీల వాపోయారు. పార్టీ అభివద్ధికి కష్టపడిన తనకు ఈ దుస్థితి ఉందంటే పార్టీలో బీసీలకు ఉన్న గౌరవం ఏ పాటిదో అర్థం చేసుకోవాలని చెప్పారు. త్వరలోనే తాము కార్యకర్తలతో కలిసి వైసిపిలో చేరబోతున్నామని వెల్లడించారు.



కవి ఆళ్లకు ఉగాది పురస్కారం

ప్రజాశక్తి - తెనాలి



తెలుగు వెలుగు సాహిత్య జాతీయ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన క్రోధి నామ సంవత్సర వేడుకల్లో భాగంగా ఉగాది పురస్కారాల ప్రదానోత్సవంలో పట్టణానికి చెందిన కవి రచయిత ఆళ్ల నాగేశ్వరరావు ఉగాది పురస్కారాన్ని అందుకు న్నారు. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన సంస్థ వాట్సప్ వేదికగా పురస్కార ప్రదానం చేసింది. పురస్కార గ్రహీత ఆళ్ళ నాగేశ్వరరావు అనివార్యం కారణాలతో హాజరు కాలేకపోవడంతో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.ఆర్.యస్.యస్.మూర్తి, చైర్మన్ యం. నారాయణరావు, ఆ సంస్థ కార్యవర్గ సభ్యులు వాట్సప్ వేదికగా అందించినట్లు ఆళ్ళ తెలిపారు. పురస్కారాన్ని ఇటీవల మృతి చెందిన తన మాతృమూర్తికి అంకితమిస్తున్నట్లు చెప్పారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి ఏపీఎస్పీ ఆరో బెటాలియంలో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని ఏపీఎస్పీ కమాండెంట్ వి రత్న బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ రామకృష్ణ, అసిస్టెంట్ కమాండ్లు డి వెంకటేశ్వ రరావు, వెంకటేశ్వర్లు, టి రవి, ఆర్ఐ లు, బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభించిన కమాండెంట్



పోస్టర్ ఆవిష్కరించిన విసి, ఆచార్య సంధ్యాకోల్ తదితరులు

వర్సిటీలో ఉచిత కుట్టు శిక్షణ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని కమ్యూనిటి సోషల్ రెస్పాన్సిబిలిటీ సెంటర్ ద్వారావృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో నెల రోజుల ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సెంటర్ డైరెక్టర్ ఆచార్య సరస్వతి రాజు అయ్యర్ తెలిపారు. ఈ కార్యక్రమ గోడపత్రికను వైస్ ఛాన్సలర్ ఆచార్య పి. రాజశేఖర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసి మాట్లాడుతూ అవసరమైన మహిళలందరూ ఈ ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని వారి అవసరాలతో బాటు ఆర్థికంగా కూడా స్వయంఉపాధి పొందడానికి వినియోగిం చుకోవాలన్నారు. వివరాలకు 9848286477, 9494964097 లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వర్శిటి రెక్టార్ ఆచార్య వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఓఎస్ డి ఆచార్య సునీత, ఐ క్యు ఏసి డైరక్టర్ అచార్య సంధ్య కోల్ తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ సందర్భంగా స్వీట్లు, పడ్లు పంపిణీ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం మసీదు వద్ద రంజాన్ పండుగ పురస్కరించుకొని, ముస్లిం సోదరులకు స్వీట్స్, పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించినట్లు మంగళగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ సలీం తెలిపారు. రంజాన్ పండుగ పర్వదినాన ప్రతి ఒక్కరికి మంచి జరగాలని, మసీదులో ప్రార్థనలు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు పఠాన్ సుభాని, షేక్ జల్సా, షేక్ దరియా తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ విజయ



ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు, లలితా సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్, చీఫ్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.విజయ ప్రతిష్టాత్మకమైన ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఎ) 2024-25కి ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. మార్చి 28 నుండి 31 వరకు కలకత్తాలో జరిగిన ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ 17వ వార్షిక సమావేశంలో ప్రస్తుతం ఐఎస్ఎ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా ఉన్న డాక్టర్ విజయ ప్రెసి డెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ స్థాపించబడిన 22 ఏళ్లలో ఈ పదవి అందు కున్న 3వ మహిళా న్యూరాలజిస్ట్‌గా డాక్టర్ విజయ నిలిచారు. ఈ అసోసియేషన్‌లో దేశంలోని 1200 కంటే ఎక్కువ మంది న్యూరాలజిస్టులు సభ్యులుగా ఉన్నారని, పక్షవాత రంగంలో శాస్త్రీయ నిబద్ధత కలిగిన మార్గదర్శక సంస్థ అని డాక్టర్ విజయ పేర్కొన్నారు. సామాన్య ప్రజలకు, వైద్యులకు పక్షవాతాన్ని ముందుగా గుర్తించి నివారించడానికి అవగాహనా కల్పించడమే కాకుండా శాస్త్రీయ పరిశోధనల ద్వారా పక్షవాతంపై పురోగతి సాధించటానికి కషి చేస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా స్ట్రోక్ కేర్‌ను మెరుగుపరచడానికి వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్, యూరోపియన్ స్ట్రోక్ ఆర్గనైజేషన్, ఆసియా పసిఫిక్ స్ట్రోక్ ఆర్గనైజేషన్‌ల సహకారంతో పనిచేఉ్తందన్నారు. ప్రతి జిల్లాలో ప్రైమరీ స్ట్రోక్ సెంటర్ ఏర్పాటుకు, ప్రొఫెషనల్, పబ్లిక్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు నిర్వహించడం, పాలసీ మేకర్స్ వైద్యులతో, ఎన్‌జిఒ సంస్థల అనుసంధానంతో స్ట్రోక్ యాక్షన్ ప్లాన్‌ను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని డాక్టర్ విజయ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు విజయకు అభినందనలు తెలిపారు.



శిక్షణలో అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్లు

ఈవీఎంలపై సంపూర్ణ అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు ఈవిఎంల వినియోగంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని, అందుకు తగిన శిక్షణ అందిస్తున్నామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బందికి ఈవిఎంల నిర్వహణపై డెమో ఈవిఎంల ద్వారా అందిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించే ఈవిఎంలు, వివి ప్యాట్‌ల పని తీరుపై సెక్టోరల్, రూట్ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానంగా ఈవిఎంలు, వివి ప్యాట్లు కమిషనింగ్, పోల్ సమయంలో ఎదురయ్యే సాంకేతిక సమస్యల పరిష్కారం చేసేలా సిద్ధమవ్వాలన్నారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఎన్నికల రోజు ఈవిఎంల్లో ఏ సమస్య ఎదురైనా తక్షణం పరిష్కారం చేసేలా శిక్షణ పొందాలని, జిఎంసి ఇంజినీరింగ్ అధికారులు కూడా తగిన శిక్షణ తీసుకోవాలన్నారు. అలాగే ఎన్నికల విధులు కేటాయించబడిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈవిఎంల పనితీరుతో పాటుగా ఎన్నికల నిర్వహణలో అవసరమయ్యే పిఓ డైరీ, 17సి, వివిధ రకాల ఫారాల గూర్చి సమగ్రంగా తెలుసుకొని ఉండాలని పేర్కొన్నారు. శిక్షణలో మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, సెక్టోరల్, రూట్ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



క్యాంప్‌ను ప్రారంబిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

టిజెపిఎస్‌లో సమ్మర్ క్యాంపు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు :స్థానిక పట్టాభిపురంలోని టిజెపియస్. కళాశాలలో స్పోర్ట్స్, గేమ్స్‌కు సంబందించి సమ్మర్ స్పెషల్ క్యాంప్ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ కె.వి.బ్రహ్మం అధ్యక్షత నిర్వహించగా, ముఖ్య అతిధిగా ఎన్‌టిఆర్ స్టేడియం పూర్వ సెక్రెటరీ డి.శ్రీనివాసరావు హాజరయ్యారు. బ్రహ్మం మాట్లాడుతూ విద్యార్థులతో పాటు బయట విద్యార్థులకు కూడా అవకాశం కల్పించేలా ఈ స్పెషల్ క్యాంపు ఉంటుందని, క్రికెట్, బాల్ బాడ్మింటన్, షటిల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, త్రోబాల్, చెస్, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్ వంటి క్రీడలకు శిక్షణ ఇవ్వటం జరుగుతుందని, కావున ఈ అవకాశాన్ని క్రీడాకారులు వినియోగించు కోవాలని చెప్పారు. డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వేగవంతమైన జీవన విధానంలో మానవులు డబ్బు సంపాదనలో పరుగులుతీస్తూ నిజమైన ఆస్తి అయిన ఆరోగ్యం గురించి మరచిపోతున్నారన్నారు. అంతే కాకుండా విద్యార్థులుపై తల్లితండ్రుల కోరికలను ప్రయోగిస్తున్నారని, దీంతో విద్యార్థులు కేవలం యంత్రాల మాదిరిగా జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. యాంత్రిక జీవనం కాకుండా వారిలో అభిరుచులను గుర్తించి వాటిల్లో శిక్షణ ఇస్తే వారు అభివృద్ధి చెందుతారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మేజర్ ఏ.బి.పి.మనోహర్, పి.జి. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్. యస్.అనితాదేవి, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, కళాశాల వ్యాయామ అధ్యాపకులు ఆర్.శివాజీ, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు డాక్టర్.జె.వి.సుధీర్ కుమార్, పాల్గొన్నారు.

24 నుంచి 26 వరకు వర్సిటీలో న్యాక్ కమిటీ పర్యటన

తేదీలు ఖరారు చేస్తూ వర్సిటీకి సమాచారం - 13, 14, 21 వర్సిటీ పనిదినాలు - అన్ని ఏర్పాట్లూ పూర్తి చేయాలి : వీసి రాజశేఖర్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాన్ని ఈనెల 24, 25, 26 తేదీలలో నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) పీర్ కమిటీ పర్యటన ఖరారైంది. ఈ మేరకు న్యాక్ కార్యాలయం నుంచి వర్సిటీకి అధికారిక సమాచారం అందింది. ఈ సందర్భంగా బుధవారం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి. రాజశేఖర్ అత్యున్నత సమావేశాన్ని వర్సిటీ అధికారులతో, అధ్యాపకులతో, ఉద్యోగులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ న్యాక్ కమిటీ పర్యటనను వివరించారు. కమిటీలో వచ్చే సభ్యులు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తారని, వారు సూచించిన విధంగా క్రైటేరియా ప్రకారం నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో ఈ నెల 13, 14, 21 తేదీలలో ఉన్న సెలవులను పని దినాలుగా మారుస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా విభాగాలు 2018 నుంచి 2023 వరకు ఉన్న ఐదేళ్ల కాలంలో సాధించిన ప్రగతిని సిద్ధం చేయాలన్నారు. సెమినార్లు, వర్క్ షాపులు, పిహెచ్‌డిలు, పుస్తకాలు ముద్రణ, పరిశోధన పత్రాలు, అవార్డులు, రివార్డులు, అకడమిక్ కరికులం, యాక్టివిటీస్, ఇన్నోవేటివ్ కార్యక్రమాలు, విద్యార్థుల ఉద్యోగ అవకాశాలు, పూర్వ విద్యార్థుల ఉన్నత స్థాయి స్థితి, కోర్సు ఫైల్, అకడమిక్ ఫైల్ వంటివి సిద్ధం చేసు కోవాలని సూచించారు. ఏ విభాగం కూడా నిర్లక్ష్యం వహించవద్దని ప్రతి ఒక్కరూ బాధ్యతగా న్యాక్ పీర్ కమిటీ బృందానికి సహకరించాలని సూచించారు. న్యాక్ పర్యటనలో విశ్వవిద్యాలయ వీసీ నుంచి కిందిస్థాయి ఉద్యోగి వరకు ప్రతి ఒక్కరు పూర్తి సహాయ సహకారాలు అందిం చా లన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వర్సిటీలో ఉన్న మౌలిక సదుపాయాల కల్పన, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ, ఎప్పటి కప్పుడు ఇబ్బంది కలగకుండా చూడాలని అదేశించారు. వర్సిటీ డిజి లాకర్ వ్యవస్థను తీసుకువచ్చిందని అందులో వర్సిటీలో ఉన్న ప్రతి కళాశాల విద్యార్థి ప్రత్యేక అకౌంట్‌ను ఓపెన్ చేసుకోవాలని వీసీ సూచించారు. అందుకు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థులకు తోడ్పాటు అందించాలని కోరారు. సమావే శంలో రెక్టార్ ఆచార్య కె.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి కరుణ, ప్రిన్సిపాల్స్ ఆచార్య స్వరూప రాణి, ఆచార్య గంగాధర్ రావు, ఆచార్య జాన్సన్, ఆచార్య సిద్దయ్య, ఆచార్య ప్రమీలా రాణి, ఆచార్య శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విసి రాజశేఖర్

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కె. రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం నగరంలోని ఏయల్. బి.ఈ.డి కళాశాలలో ఎన్నికల విధులు కేటాయించబడిన సెక్టోరల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, కమిషనింగ్, డిస్ట్రిబ్యూషన్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ దేశ వ్యాప్తంగా ఎన్నికలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని, సార్వత్రిక ఎన్నికల్లో విధులు కేటాయించబడిన అధికారులు సిబ్బంది కేటాయించబడిన విధులపట్ల సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. విధుల్లో ఏమాత్రం అశ్రద్ధ వహించినా ఎలక్షన్ కమిషన్ తీవ్రమైన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఇంజినీరింగ్ అధికారులు ఈవియంల కమిషనింగ్ రూమ్, స్ట్రాంగ్ రూమ్‌లలో అవసరమైన విద్యుత్, ఫర్నీచర్, త్రాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బందికి నిర్వహించాల్సిన విధులపై పూర్తి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎవరికైనా సందేహాలు ఉంటే వెంటనే వాటిని నివత్తి చేసుకోవాలన్నారు. మే 12న డిస్ట్రిబ్యూషన్ జరుగుతుందని, విధులు కేటాయించబడిన అధికారులు నిర్దేశిత సమయానికి విధులకు హాజరు కావాలని ఆదేశించారు. సమావేశంలో ఏఆర్‌ఓలు నిరంజన్, కుమార్, ఏఈఆర్‌ఓలు సి. హెచ్.శ్రీనివాస్, యన్.శ్రీనివాస్, ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ పద్మ, సెక్టోరల్ అధికారులు, రూట్ ఆఫీసుర్లు, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ రాజ్యలక్ష్మి

క్షయ వ్యాధిపై హిందూ ఫార్మసీలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కాలేజిలో ఎన్ఎస్ఎస్ యూనిట్, ఫార్మసీ ప్రాక్టీసు డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా కళాశాల వైస్ ఛైర్మన్, ఎన్ఆర్ఐ పల్మనాలజి విభాగాధిపతి డాక్టర్ ఆర్.రామకృష్ణ మాట్లాడుతూ క్షయవ్యాప్తి, లక్షణాలు, నిర్ధారణ పరీక్షలు, చికిత్స విధానాలను గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. క్షయ, ఎయిడ్స్, క్షయతోపాటు మూత్రపిండాల సమస్యలు ఉన్న వారి చికిత్సకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. కొన్ని రకాల క్షయవ్యాధికి అందుబాటులో ఉన్న చికిత్స విధానాలను వివరించారు. డయాబెటీస్, హైపర్ టెన్షన్ లాంటి వ్యాధులకు జాతీయ స్థాయిలో వ్యాధి నివారణ/నిర్మూలన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన పెంచటం వల్ల చికిత్స సులభతరం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మా డి డైరెక్టర్ పి.సీతా రామయ్య, హెచ్ఒడి డాక్టర్ ఎన్. హేమకుమారి, తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణను సన్మానిస్తున్న అధ్యాపకులు

గుంటూరులో రేపు సీఎం సభ

రెండు లక్షల మంది హాజరవుతారని అంచనా

ఏర్పాట్లపై పార్టీ నాయకులతో మంత్రి విడదల రజిని సమావేశం

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు గుంటూరులో శుక్రవారం ఏటుకూరు బైపాస్ వద్ద నిర్వహిస్తున్నట్లు మంత్రి విడదల రజనీ తెలిపారు. సిఎం సభ ఏర్పాట్లపై వైసిపి నాయకులతో స్థానిక చంద్రమౌళి నగర్‌లోని వైసిపి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ జగన్‌కి ఘనస్వాగతం పలికేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. స్వచ్ఛందంగా తరలివచ్చి మద్దతు తెలుపుతున్నారని వెల్లడించారు. గత ఐదేళ్ల సంక్షేమ పాలనే జగనన్నపై అభిమానాన్ని రెట్టింపు చేసిందని పేర్కొన్నారు. ఈ బస్సు యాత్రను దిగ్విజయం చేయాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందని చెప్పారు. బస్సు యాత్రలో భాగంగా ఏటుకూరు రోడ్డులో భారీ బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. రెండు లక్షల మందికిపైగా ప్రజలు ఈ సభకు హాజరవుతారని అంచనా వేస్తున్నా మన్నారు. వీరందరికీ ఎలాంటి లోటు లేకుండా పక్కాగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఈ నెల 12వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకల్లా గుంటూరు నగరంలోకి ప్రవేశిస్తుందని చెప్పారు. హౌసింగ్ బోర్డు వద్దకు చేరుకున్న తర్వాత అక్కడి నుంచి ర్యాలీగా బస్సు యాత్ర చుట్టుగుంట, వీఐపీ రోడ్డుకు వస్తుందన్నారు. అక్కడి నుంచి ఏటుకూరు సభాస్థలికి యాత్ర చేరుకుంటుందని వెల్లడించారు. ఏటుకూరు సభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బస్సు యాత్ర విజయవంతం చేయాలని ఎం. ఎల్.సి. అప్పిరెడ్డి కోరారు. గతంలో వలంటీర్లను విమర్శించిన చంద్రబాబు ఇప్పుడు వలంటీర్లపై కపట ప్రేమను ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఏసురత్నం మాట్లాడుతూ ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని తెలిపారు. గుంటూరు పార్లమెంటు అభ్యర్థి కిలారి రోశయ్య మాట్లాడుతూ జగనన్న ఈ రాష్ట్రానికి మరోసారి ముఖ్యమంత్రి కావాలని ప్రజలంతా ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే మద్దాల గిరిధర్, రాతం శెట్టి సీతా రామాంజనేయులు, డైమండ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి రజిని